ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

మంగళవారం 23 సెప్టెంబరు 2025

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు

- ఈ కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు
- ప్లాట్‌ఫామ్, ఆఫర్, హ్యాండ్లింగ్ ఫీజుల పేరుతో భారీగా వడ్డన
- నో రీఫండ్.. రిటర్న్ ఆప్షన్ తొలగిస్తున్న వైనం..
- తప్పుడు ప్రాడక్టు వచ్చినా స్పందించని వైనం

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే విని యోగదారుల ముందుకు తీసుకురావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకువస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువ మంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ పర్చేష్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలామంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోసపోతున్నారు. ఒకవేళ వాటిని గుర్తించినా.. రిటర్న్ చేయడానికి అవకాశం కూడా ఉండడం లేదు.



పండగల వేళ..పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఈ రెండు పండగల సందర్భంలో రూ.200 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని అంచనా. అందులో సుమారు రూ.150 కోట్లు ఆన్‌లైన్ వ్యాపారమే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏడాది పాటు జరిగే వ్యాపారంతో సమానంగా ఈ రెండు పండగల సమయంలోనే జరుగుతుండంటే.. ఎంత భారీ స్థాయిలో వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారో ఇట్టే అంచనా వేయవచ్చు. నగటున ప్రతి వంద మంది కొనుగోలు దారుల్లో

(మిగతా 8వ పేజీలో)

ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చిపోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినకాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం !



విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న మంత్రులు రవికుమార్, డీబీవీ స్వామి

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- 400 మంది విద్యార్థులకు
- సైకిళ్ల పంపిణీ
- అద్దంకిలో ఎస్సీ బాలికల వసతిగృహం : మంత్రి డీబీవీ స్వామి

అద్దంకి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సెడ్‌క్యాప్ సహకారంతో 400 మంది విద్యార్థులకు సైకిళ్లను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామితో కలిసి సోమవారం ఆయన పంపిణీ చేశారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో..స్థానిక పాఠశాల విద్యార్థులు 300 మంది, గొరకాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మందికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడుతూ సైకిల్‌పై విద్యార్థులు పాఠశాలకు రావడం ద్వారా సమయం ఆదా అవుతుందని, ఆ సమయాన్ని చదువుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. అద్దంకిలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో సైకిల్ యాత్ర చేసే సమయంలో విద్యార్థులు సైకిళ్లు లేక ఇబ్బంది పడటాన్ని గమనించానని తెలిపారు. అన్ని పనులు ప్రభుత్వం చేయలేదని, అందువల్ల దాతల సహకారంతో నియోజకవర్గంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 3 వేల మందికి అందజేయడం జరిగిందన్నారు. అదే సమయంలో దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో చీరాల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈఓ-2 కేవీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.



అభివృద్ధిలో..టాప్-3లో ఉండాలి

- 26, 27న అధిక వర్షాలు పడొచ్చు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సమీక్షలో బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో బాపట్ల జిల్లా రాష్ట్రస్థాయిలో టాప్-3లో ఉండేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదని బాపట్లజిల్లా కలెక్టర్ వీ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొంత మంది తహసీల్దార్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇకనుంచి అలాజరిగితే తగిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటలలోపు కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులకు ఫోన్లు వస్తాయని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ఈఆఫీస్‌ద్వారానే అన్నిఫైల్స్ కలెక్టర్ కార్యాలయానికి అన్నిశాఖల అధికారులు పంపించాలని సూచించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 26,27 తేదీల్లో బాపట్ల జిల్లాలో భారీవర్షాలు వచ్చే అవకా శం ఉందనే సమాచారం ఉందని, అధికారులు అంద రూ సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణానదికి వరద తీవ్రత దృష్ట్యా, తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పారిశుధ్యంపై అధికారులు దృష్టిపెట్టాలని అక్కడకక్కడ కొబ్బరి బొండా చిప్పలు, చెత్తదిబ్బలు ఉన్నాయని వాటిని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ సెక్రటరీలు చూడాలని డీపీవోలను ఆదేశించారు. వానాకాలం జ్వరాల నియం త్రణకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు వైద్య సిబ్బంది అందరూ ఆసుపత్రి, పీహెచ్‌సీలలో అందుబాటులో ఉండాల న్నారు. అనంతరం రేపల్లె మండలం పెనుమూడి వారధి సమీపంలో వరద ఉధృతిని పరిశీలించారు. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం తూర్పుపాలెం ప్రాంతాల్లో గతంలో కరకట్టకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కరకట్టకు నిర్వహించాల్సిన మరమ్మతులను ఏవిధంగా చెయ్యాలనే దానిపై ఇరిగేషన్, ఆర్‌సీ,ఏఈలకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మీ, డీఎస్పీ ఆవులశ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓలేరుపల్లెపాలెం వద్ద గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జీఎస్టీ 2.0పై ఎంపీ తెన్నేటి ప్రచారం

బాపట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలపై బాపట్ల పట్టణంలోని రథం బజారులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నేరుగా నిత్యావసర, మెడికల్, ఎలక్ట్రికల్ దుకాణాల వద్దకు వెళ్లి.. పేద, మధ్యతరగతి వర్గాలకు నూతన సంస్కరణల వల్ల ఎంత మేలు చేకూరనుందో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వల్ల ఫార్మా రంగంపై పన్ను 12 శాతం నుంచి 5 శాతం, సిమెంట్ అండ్ కనస్ట్రక్షన్‌ల్లో 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిందని వివరించారు. పిల్లల చదువుకు సంబంధించిన వస్తువులపై వస్తు సేవల పన్ను లేదని తెలిపారు. ప్రతి దుకాణ యజమాని జీఎస్టీకి సంబంధించిన బోర్డులను ప్రజలకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



జీఎస్టీ సంస్కరణల అవగాహన ర్యాలీలో ఎంపీ కృష్ణప్రసాద్



శ్రీ బాలాత్రిపురసుందరిదేవిగా

శ్రీబగళాముఖి

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో అమ్మ వార్లకు వివిధ అలంకరణలు గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు.



వృద్ధుడి వద్ద అర్జీ తీసుకుంటున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

మానవీయ కోణంలో సమస్యలకు పరిష్కారం

బాపట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మానవీయ కోణంలో అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. అర్జీదారులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం చూపాలని కోరారు. భట్టిప్రోలుకు చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి, 80 ఏళ్ల వృద్ధుడు బత్తుల సుబ్బారావు తన సమస్యను చెప్పుకోవడానికి వచ్చారు. ఆయన నడవలేక ఇబ్బంది పడుతుండడంతో సిబ్బంది ద్వారా తెలుసుకుని.. ఎస్పీ స్వయంగా ఆయన వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. 65 మంది పీజీఆర్ఎస్‌లో సమస్య పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో!

నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

- గత టీడీపీ హయాంలో నిరంతరాయంగా ప్రక్రియ
- వైసీపీ రాకతో ఆ విధానానికి స్వస్తి
- కూటమి ప్రభుత్వం రాకతో లబ్ధిదారుల్లో ఆశలు
- కార్యాలయాలకు వెల్లువలా దరఖాస్తులు, వినతులు
- కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు


రేపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం కొండంత ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో 15 నెలలుగా ఎదురు చూస్తున్నారు. నిరంతరాయంగా పింఛను దరఖాస్తులు, వినతులు వెల్లువలా ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముంచెత్తుతున్నాయి.

నాడు అలా.. ఇప్పుడు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెర మీదకి తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాలు లేవు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో ప్రతి నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ, ఆ ఊసే లేదు.

బాధితులకు న్యాయమెప్పుడు..?

గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పింఛనుదారులను ఘోరంగా వంచిస్తూ నిబంధనల పేరుతో వడపోత మొదలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ చెల్లించారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, నాలుగు చక్రాల వాహనం ఉందని, పరిమితికి మించి ఇళ్ల స్థలాలు, పొలాలు ఉన్నాయన్న నెపంతో వేలాది మందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించింది. ఇలా ఒకసారి తొలగిస్తే వారికి మళ్లీ అవకాశం రావడానికి ఆరు నెలలు పడుతుంది. అలా కోల్పోయిన పింఛన్లు వైసీపీ హయాంలో తిరిగి వచ్చిన దాఖలాలు లేవు.



కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛనును రూ. 3 నుంచి 4 వేలకు పెంచింది. దానికి తోడు బీసీ, ఎస్సీ, ఎస్టీ పింఛనుదారుల వయోపరిమితిని 50 ఏళ్లకు తగ్గిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఉన్నారు. దీంతో వారంతా కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 50 వేల మంది వరకూ అర్హులైన వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు.

ఎరువులపై 'అగ్రహార' రైతుల ఆందోళన

బల్లికురవ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టదారు పాసు పుస్తకాలు లేవని తమకు ఎరువులు ఇవ్వడం లేదని అగ్రహార భూముల సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి తదితర గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల అగ్రహార భూములున్నాయి. ఈ భూములకు ఎలాంటి పట్టాదారు పుస్తకాలు లేవు. రైతులు దశాబ్దాల నుంచి ఈ భూములను సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాసు పుస్తకాలు ఉన్న రైతులకే ఎరువులు ఇస్తామని అని చెబుతుండటంతో సాగుదారులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు మాత్రం రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు ఇస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సక్రమంగా అందించడం లేదని రైతులు వాపోతున్నారు. వరి సాగు మొదలైందని.. సకాలంలో ఎరువులు అందించకుంటే తీవ్రంగా ఇబ్బంది పడతామని రైతులు అంటున్నారు. పాసు పుస్తకాలతో సంబంధం లేకుండా ఎరువులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ వివరాలతో ఎరువులు: ఏవో

అగ్రహార భూముల సాగుదారులకు ఎరువులు ఇవ్వడం లేదనే అరోపణపై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. పాసు పుస్తకాలు లేకున్నా.. ఆన్‌లైన్ వివరాలు తీసుకుని ఎరువులు అందజేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

బాధ్యతలు చేపట్టిన భార్గవ తేజ


సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన భార్గవ తేజ

తుళ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా అమిలినేని భార్గవ తేజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను మర్యాదపూర్వకంగా భార్గవ తేజ కలిశారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి భార్గవ తేజకు అభినందనలు తెలిపారు. ఇప్పటి దాక సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా పనిచేసిన మల్లవరపు నవీన్ ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా జాయింటు కలెక్టర్‌గా వెళ్లారు. గుంటూరు జిల్లా జాయింటు కలెక్టర్‌గా పనిచేసిన భార్గవ తేజను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నియమితులయ్యారు.

డీఎస్సీ అభ్యర్థులు రేపు గుంటూరులో రిపోర్ట్ చేయాలి: డీఈవో

గుంటూరు విద్య సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్‌లో ఉన్న ఆంధ్ర ముస్లిం కళాశాలలో బుధవారం ఉదయం 11 గంటలకు రిపోర్టు చేయాలని డిఈవో సీవీ రేణుక తెలిపారు. అక్కడకు వస్తే ఈ నెల 25న జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. 25వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో ఆంధ్ర ముస్లిం కళాశాలకు రావాలని సూచించారు. వారిని ప్రత్యేక బస్సుల్లో సచివాలయం సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని డిఈవో తెలిపారు.

ట్విట్టర్‌లో సమస్య పై స్పందించిన మంత్రి నారా లోకేశ్

సత్తెనపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘు రామ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో రోడ్ల దుస్థితి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యను తీర్చాలని ఆ ప్రాంతానికి చెందిన నందా సాంబశివరావు ట్విట్టర్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన నారా లోకేశ్.. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట రోడ్డు మార్గ నిర్మాణం త్వరలో జరగనుందని, రఘు రామ్ నగర్ ప్రాంతంలోని ఎక్స్‌టెన్షన్ ఏరియాలో ఉన్న రోడ్లను కూడా మరమ్మత్తులు చేస్తామని ట్విట్టర్‌లో తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత మంత్రితో కూడా సమస్యపై మాట్లాడినట్టు లోకేశ్ పేర్కొన్నారు.

అచ్చంపేట డాక్టర్ రాజేశ్ కుమార్ సస్పెన్షన్

అచ్చంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీ రవి సోమవారం తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో సకాలంలో వైద్యం అందక ఓ రోగి మృతి చెందినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్ రాజేశ్ కుమార్ లేకపోవటంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

పశ్చిమడెల్టాకు 7,004 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,009 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 200 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1,356 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 524 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 225 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 399 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1,173 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,785, మోడల్ ధర రూ.10,650 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్ ధర రూ.10,525 పలికాయి.

గురజాడ గృహాన్ని స్మృతి చిహ్నంగా అభివృద్ధి పరచాలి

● అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ


విలేకరులతో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పక్కన మాజీ మంత్రి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, లక్ష్మణ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దీనావస్థలో ఉన్న మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని అభివృద్ధి పరిచి సాహి తీవేత్తలకు, సామాజిక మార్పు కోసం తపిస్తున్న ఔత్సాహికులకు స్ఫూ తి నిలయంగా తీర్చిదిద్దాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీ య అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం గుం టూరులోని జనచైతన్య వేదిక హాలులో పెనుగొండ లక్ష్మీనారాయణ విలేకరులతో మాటాడారు. సాంస్కృతిక స్థాయి లోపించిన పాలక పక్షాలతో తెలుగు సాహిత్యానికి, సమాజానికి విఘాతం కలుగు తుందని అన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు ప్రాచీన రచయితలను గుర్తు చేసుకుంటూ గౌరవిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో గుర జాడ, కందుకూరి, గిడుగు, జాషువా లాంటి మహనీయులను విస్మ రించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశా రు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లా డుతూ, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించకపోతే సమాజం పతనమవు తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మ ణరావు మాట్లాడుతూ, గురజాడ జయంతిని ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని, ఆయన పేరుతో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నవంబరు 30న విజయనగరంలో గురజాడ వర్ధంతి రోజు సాహితీ ప్రియులతో, పౌర సంస్థల ప్రతినిధు లతో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల గురజాడ అప్పారావు గృహాన్ని అభివృ ద్ధి చేస్తామని, స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించడం హర్షదా యకమన్నారు. రాజధాని అమరావతిలో నిర్మించ తలపె ట్టిన కేంద్ర గ్రంథాలయానికి గురజాడ పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మ ణ్యం, కన్నా మాస్టర్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, సామాజిక విశ్లేషకుడు టి. ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

117 మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు

మంత్రి లోకేశ్‌కు అభ్యర్థుల ధన్యవాదాలు


ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సం స్థ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీ ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు నియోజకవర్గ వ్యా ప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజర య్యా రు. ప్రతిభ, అవగాహన, ఇంటర్వ్యూల ఆధారంగా 117 మందికి ఉద్యో గాలు లభించాయి. 12కు పైగా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా సంస్థల్లో రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం లభించే ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన అ భ్యర్థులకు స్థానిక టీడీపీ నాయకులు నియామక పత్రాలను అందజే శారు. ఈ సందర్భంగా ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి మాట్లాడుతూ, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రతి నెలా నియోజకవర్గ పరిధిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మే ళా నిర్వహిస్తామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే.సంజీవ రావు, కళాశాల ప్రిన్సిపాల్ గొడవర్తి నాగేశ్వరరావు, టీడీపీ మంగళగిరి, దుగ్గిరాల మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, నేతలు వాసా పద్మ, మల్లవరపు వెంకట్, షేక్ నజీర్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షల ఫలితాల విడుదల


దూర విద్య పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్, దూరవిద్య డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయం (ఏఎన్‌యూ) దూరవిద్య కేంద్రం పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సం బంధించి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు సోమ వారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, వర్సిటీ ఇన్‌చార్జీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ దిట్టకవి రామచంద్రన్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాలలో పరీక్షలు సజావుగా జరిగాయన్నారు. ఎంబీఏ పరీక్షకు 444 మంది హాజరు కాగా 435 మంది అర్హత సాధిం చారని, ఎంసీఏ పరీక్షకు 82 మంది హాజరు కాగా 80 మంది అర్హత సాధించారని తెలిపారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఐసీటీ డైరెక్టర్ ప్రభాకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సూపరింటెండెంట్ జవాజి శ్రీనివాస రావు, అధ్యాపకులు డాక్టర్ భరత్, డాక్టర్ ఎన్ బాబు, ఉద్యోగులు రాధాకృష్ణ, డాక్టర్ ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మన పండగలు... మన చేనేతలు

● ఈ నినాదాన్ని ప్రతీ ఒక్కనాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
● పండగలు, శుభకార్యాలకు చేనేత చీరలనే కొనుగోలు చేద్దాం
● 'ఎక్స్'లో డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న పోస్టు వైరల్




గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన పండ గలు... మన చేనేతలు అన్న నినాదాన్ని ప్రతీ ఒక్క సెల బ్రిటీ, నాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే చేనేత పరిశ్రమ కచ్చితంగా నిలదొక్కుకొంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డా క్టర్ పెమ్మసాని శ్రీరత్న పిలుపునిచ్చారు. దసరా నవరాత్రులు ప్రారం భం కావడంతో మహిళలు ఎక్కువగా చీరలు కొనుగోలు చేయనున్న దృష్ట్యా ఆమె సామాజిక మాధ్యమైన 'ఎక్స్' వేదికగా తన అంతరం గాన్ని పోస్టు చేశారు. డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ గత ఏడాది విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్థాపించిన చేనేతశాలను తాను సందర్శిం చడం జరిగిందని, అక్కడ అనేక విషయాలు తెలుసుకొన్నానన్నారు. చేనేత కార్మికులంటే మగ్గం మీద నేసే వాళ్లు మాత్రమేనని మనకు తెలుసు. అయితే ఒక చీర కథ లూం(దారం)తో మొదలౌతుంది. దారం తయారీ చేయాలంటే తొలుత బ్లీచింగ్ నీళ్లలో నూలుని శుద్ధి చేస్తారు. ఆ తర్వాత రంగు పట్టించడానికి యాసిడ్ వాడుతూ వేడినీ ళ్లని పట్టిస్తారు. లూమ్ ఆరడానికి సరైన వాతావరణం ఉండాలి. వర్షం పడితే లూమ్ ఆరదు. ఇంత చేసినా కార్మికుడికి వచ్చేది రూ. 500 మాత్రమే. ఆ తర్వాత లూం నుంచి చరక మీదకు తీసుకెళ్లి సన్నగా దారాన్ని తయారు చేస్తారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తి అయ్యాక మగ్గం మీదకు వెళుతుంది. డిమాండ్ లేకపోతే వస్త్రం తయారు కాదు. దీంతో నిలకడైన ఆదాయం లేక చేనేత రంగాన్ని చాలామంది వదిలేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు 9 రకాలైన చేనేతలున్నాయి. కలంకారి, మంగళగిరి, చీరాల, వెంకటగిరి, పొందూరు, ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్, ధర్మవరం చీరలను ఆదరించి కార్మికులను ప్రోత్సహించాలన్నారు. టెక్నాలజీ ఎంత పెరుగుతున్నా వృత్తి విద్యల ను ఆదరించాలన్నారు. అప్పుడే ఉన్న పరిశ్రమని బతికించుకోగలు గు తామని చెప్పారు. సీఎం సతీ మణి నారా భువనేశ్వరి పిలుపుమే రకు తాను దసరా పండగకు అమ్మవా రికి 9 రకాల చేనేతల చీరలు పెడుతున్నానన్నారు. అలానే దసరా, దీపావళి, కార్తీకమాసం, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి ఇలా అనేక పండగలున్నాయి. అలానే శుభకార్యాలు జరుగుతుం టాయి. ప్రతీసారి చేనేత చీరని కొనుగోలు చేస్తే ఆ రంగం కార్మికులకు ఎంతో ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. అలానే డిజైనర్లు వచ్చి మంచి డిజైన్లతో చీరాలు తయారు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నవరాత్రి మన సంస్కృతిని గుర్తు చేసే సందర్భం కావాలి. చేనేత కార్మికుల శ్రమను తెలుగుదనంతో నింపాలి. మనం చేసే ప్రతీ చేనేత కొనుగోలుతో ఒక్కో కుటుంబంలో ఉత్సాహాన్ని నింపుదామని డాక్టర్ శ్రీరత్న పిలుపునిచ్చారు.

పోక్సో కేసులో పది సంవత్సరాల జైలు శిక్ష

నాదెండ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మందా రపు శివ ప్రసాదు అనే వ్యక్తికి పోక్సో కేసులో పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ 2వేల జరిమానా పడింది. ఈ మేరకు శివ ప్రసాదుకు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి షమ్మి పర్విన్ సుల్తాన బేగం సోమవారం తీర్పునిచ్చారు. 2022 మే 28న రాజీవగాంధీ కాలనీకి చెందిన ఒకరు ఇచ్చిన ఫిర్యాదు చేయగా డీఎస్పీ విజయ భాస్కర్ విచారణ జరిపారు. ఈ కేసులో శివ ప్రసాదు దోషిగా తేలటంతో ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్టు నాదెండ్ల ఎస్సై పుల్లారావు తెలిపారు.

భూసేకరణకు ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగింపునకు ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేయా లని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తే ళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చానల్ పొడిగింపు కా ర్యాచరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీ పీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేశ్‌బాబు అధ్యక్ష తన జరిగిన సమావేశంలో కేఎస్ లక్ష్మణరావు మాట్లాడు తూ, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని ప్రజల చిరకాల వాంఛ అయిన గుంటూరు చానల్, వరికపూడిశెల ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని కోరారు. గుంటూరు చానల్ పొడి గింపుతో 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అయితే భూసేకరణకు కోసం రూ.120 కో ట్లు కేటాయించాల్సి ఉంటే, ప్రభుత్వం రూ. 30 కోట్లు మాత్రమే కేటా యించిందని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు. అనం తరం సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ, గు ంటూరు చానల్ పొడిగింపుతో ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకోవచ్చని అన్నారు. కాలువ పొడిగించేంత వరకు ప్రభు త్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. చానల్ పొడిగింపు అంశంపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా ఉన్నారని మా జీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘ జిల్లా సహాయకార్యదర్శి కొత్త వెంకటశివరావు, నల్లమడ రైతు సంఘ నాయకులు నరిశెట్టి ఆచారి, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగి రిరావు, ముద్దన రాఘవయ్య, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, రైతు సంఘ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్ల మోతు రాజేంద్ర, పోపూరి సుధీర్, ఆశీర్వాదం, నూర్‌బాషా సుభానీ సాహెబ్, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మీ, పి సలీం పాల్గొన్నారు.

దుగ్గిరాలలో భారీ చోరీ....

● రూ.2.43 లక్షల విలువైన బంగారు నగల అపహరణ

దుగ్గిరాల, సెప్టెంబరు 22: మండల కేంద్రం దుగ్గిరాలలోని బ్రాహ్మణ బజారులో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొల్లిపర చంద్రశేఖర్ ఈ నెల 20న తిరుమల వెళ్లారు. ఆయన భార్య విజయవాడ సమీపంలో ఉన్న పెనమూలూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు బద్దలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. చంద్రశేఖర్ 22వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉండటాన్ని చూసి ఆందోళన చెందారు. ఇంటి లోపలికెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన రూ.2.43 లక్షల విలువైన 98 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దాంతో వెంటనే భార్య జ్యోతికి ఫోన్ చేసి ఇంటికి పిలిపించి ఇరువురు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటరవి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శుభం మహేశ్వరి కోల్ట్‌స్టోరేజీలో తహసీల్దార్ తనిఖీలు


దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి సిబ్బందిని ప్రశ్నిస్తున్న తహసీల్దార్ సునీత, యార్డు సెక్రటరీ సుబ్బారావు తదితరులు

దుగ్గిరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన పసుపును గ్రేడింగ్ చేయిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో తహసీ ల్దార్ తనిఖీలు నిర్వహించారు. 2024 జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నిల్వపెట్టిన రూ. కోట్లు విలువ చేసే పసుపు పంట అగ్నికి ఆహుతైంది. అప్పట్లో మంత్రి నారా లోకేశ్, కేంద్రసహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో పంట బీమా చేసిన రైతులకు, వ్యాపారులకు వారి ఖాతాల్లో నగదును జమచేశారు. కాగా, ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయిన 1,169 బస్తాల పసుపును అధికా రులు సీజ్‌చేసి, కోల్డ్‌స్టోరేజీ ఆవరణలోనే భద్రపరిచారు. అయితే అధికారుల అనుమతి లేకుండా యాజమాన్యం పసుపు ఫ్యాక్టరీ కూలీలతో రెండ్రోజులుగా గ్రేడింగ్ చేయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి పెమ్మసాని ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. సమస్య పరిష్కార దశలో ఉండగా సీజ్‌చేసిన పంటను గ్రేడింగ్ చేయడమేమిటని ప్రశ్నించారు. అనంతరం మొత్తం పసుపు బస్తాలను యథాతథంగా బస్తాలలో నింపి సీజ్ చేశారు. యార్డు సూపర్‌వైజర్ శేషుబాబు, వీఆర్‌వోలు, పలువురు బాధిత రైతులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు. కాగా, పసుపు బస్తాలను విక్రయించి వచ్చే మొత్తాన్ని నష్టపోయిన రైతులకే పంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భూ వివాదంలో ఎస్ఐ పుల్లారావు బెదిరింపులు

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

నాదెండ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం తనకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చినా భూమి వదిలి వెళ్ళాలని నాదెండ్ల ఎస్సై పుల్లారావు తనను బెది రిస్తున్నారని చిరుమా మిళ్ళ గ్రామానికి చెందిన కావూరి శివయ్య సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన మేనమామ పాములపాటి గోపయ్య ఇచ్చిన వీలునామా ప్రకారం నాదెండ్ల గ్రామ పరిధిలో సుమారు ఎకరం ఆరు సెంట్ల భూమి తనకు వచ్చిందన్నారు. కాగా గోపయ్య బంధువైన పాములపాటి వెంకట శివరావు ఫోర్జరీ దస్తావేజును సృష్టించి ఆ భూమిని తన తల్లితో 2010లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అదే భూమిని ఆయన ప్రస్తుత జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావుకు తాకట్టు పెట్టారన్నారు. ఈ విషయమై 2012లో కోర్టుకు వెళ్ళగా 2022లో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించారు. రెవెన్యూ అధికారులు ఆ భూమిని తన పేరుతోనే అడంగల్, 1బీలో ఎక్కించారని వివరించారు. కాగా, ఎస్సై పుల్లారావు 20 రోజుల క్రితం తనను పిలిచి భూమి వదిలి వెళ్ళకపోతే ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించి ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించారని ఆరోపించారు. ఎస్సై పుల్లారావు, వెంకట శివ, చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన కట్టా శౌరి (నాగేశ్వరరావు) తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనను కాపాడాలని వేడుకున్నాడు.

నరసరావుపేట కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


బ్రహ్మయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న అధికారులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపే టలో ని పల్నాడు జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో జొన్నలగడ్డకు చెం దిన చట్టు బ్రహ్మా య్య అనే వ్యక్తి సోమవారం ఆత్మ హత్యాయత్నం చే శాడు. తన ఇంటి స్థలాన్ని పంచా యతీ కార్యదర్శి వేరే వారి పేరు మీద రాశారని, ఈ విష యాన్ని తాను గతంలో చాలా సార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందని చట్టు బ్రహ్మయ్య తెలిపారు. దాంతో మనస్థాపం చెంది ఆత్మహ త్యాయత్నం చేశానని చెప్పా డు. పోలీసులు వెంటనే స్పందించి చట్టు బ్రహ్మయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ఆసుపత్రితో చికిత్స పొందుతున్న అతన్ని తాహసీల్దార్ కే వేణుగోపాలరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, ఇతర అధికారులు పరామర్శించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

25,802 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 28,258 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,161 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14300
నెంబరు. 5	10000	13500
273	----	----
341	10000	15200
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
షార్క్-1	-----	-----
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14500
నెంబరు. 5	10000	13800
273	----	----
341	10000	15300
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి	10000	15200
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	5000	7200

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సైబర్‌నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎస్పీ బి. ఉమామహేశ్వర్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల భారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రచార పోస్టర్‌లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్ళు చేసే వీడియోకాల్స్‌కు స్పందించవద్దని ప్రజలకు తెలిపారు. ఈడిజిటల్‌యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో సైబర్ నేరాలు కూడా అంతేవిధంగా పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీసుస్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా ప్రజలకు సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఎస్పీ తెలిపారు.

పరిపాలనలో పారదర్శకంగా పని చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యంత్రాంగం పరిపాలనలో పారదర్శకంగా, నాణ్యతతో పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కలెక్టర్ కార్యాలయ పీజీఆర్ఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో అన్ని విభాగాలలో ఇతర జిల్లాల కంటే ర్యాంకింగ్‌లో మొదటి మూడు వరసలలో ఉండేవిధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి సమస్యను పారదర్శకతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఏమైన సమస్యలు ఏర్పడిన యెడల వాటి విషయాలు తెలుసుకొని సత్వర పరిష్కార చర్యల కొరకు కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డీఆర్వోకు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి నాగిరెడ్డి, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లికార్జునరావు, పీజీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలి

జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద ముమ్మరంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉపాధిహామీ పథకం, జిఎస్‌డబ్ల్యుఎస్ సేవలు, స్వామిత్వ, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ, అనుసంధాన రంగాలలో ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టాలని ఆయన అధికారులకు తెలిపారు. జిల్లాలో స్వామిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. కర్లపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అభివృద్ధి పనుల అమలులో వెనుకబడి ఉన్నారని పద్దతి మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబం ఆరోగ్యం

కర్లపాలెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : ఒక కుటుంబంలోని మహిళ ఆరోగ్యకరంగా ఉంటేనే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపినాథ్ అన్నారు. కర్లపాలెం మండలం ఎత్రావారిపాలెం గ్రామసచివాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన ఆడపిల్లలకు సంబంధించిన వ్యాక్సిన్లు ఆసుపత్రులో చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యశాల వైద్యులు సిద్దార్థ, రోషన్‌ఆరా, గ్రామసర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లెళ్ళమూడిలో దసరా శరన్నవరాత్రులు ప్రారంభం

బాపట్లరూరల్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు. నైవేద్యాలు, మేళతాళాల నడుమ మంగళహారతులు అద్దటంతో ప్రారంభమై అనసూయదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 27 నుంచి విశేషంగా చండీహోమం, నవరాత్రుల చివరి మూడురోజుల్లో అమ్మవారు స్వర్ణకిరీటధారణిగా దర్శనమిస్తారని శ్రీవిశ్వజనని పరిషత్ టెంపుల్స్ ట్రస్ట్ ట్రెజరర్ జేఎల్‌పీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఫిర్యాదు

కర్లపాలెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని పెద్దపులుగువారిపాలెం, గణపవరం గ్రామాలకు చెందిన యువకులు సోమవారం భారీగా ఆ గ్రామాల నుంచి బయలుదేరి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. రహదారి మీద పెద్ద గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించటం లేదని పేర్కొన్నారు.

నిషేధిత వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు : సీఐ

బాపట్ల, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, నిషేధిత వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు అన్నారు. సోమవారం రాత్రి బాపట్ల చీలురోడ్డు వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని బాపట్ల పట్టణ పోలీసులు నిర్వహించారు. ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగుహెచ్చరికలను పట్టణ సీఐ రాంబాబు జారీ చేశారు.

ప్రహరి కూలి ముగ్గురికి గాయాలు

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం కారుమూరి హనుమంతరావు నాయుడు నగర్ కాలనీలో సోమవారం ప్రహరి గోడ కూలగా ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా తరలించారు. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ● వేదికకు 9 అర్జీలు



కలెక్టర్‌కు నియోజకవర్గంలోని పలు సమస్యలు వివరిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కారవేదికను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 9 అర్జీలు వచ్చాయని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి

రేపల్లె నియోజకవర్గంలో యూరియా కొరత అధికంగా ఉందని, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ వివరించారు. మంత్రిపాలెం సొసైటీలో గత సంవత్సరం 14 వేల యూరియా బస్తాలు అందిస్తే ఈ ఏడాది 7 వేల యూరియా బస్తాలు మాత్రమే వచ్చాయని తెలిపారు. చౌడు భూములు కావటంతో అధికంగా యూరియాను వాడాల్సిన పరిస్థితి ఉందని రైతుల ఇబ్బందులు గుర్తించి యూరియాను అందించాలని సూచించారు. అదే విధంగా రేపల్లెమండలం నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో కొంతమేర యూరియా, డీఏపీ కావాల్సి ఉందని, వ్యవసాయ శాఖ ద్వారా యూరియాను అందించే విధంగా చూడాలని ఆయన కోరారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని ప్రతి అర్జీకి తప్పనిసరిగా పరిష్కారం చూపాలని జిల్లా ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్, డీఆర్వో జి. గంగాధర్‌గౌడ్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జరిగినది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతిపత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడ పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలనకు, మరికొన్నిటిని విచారణకు ఆదేశిస్తూ సంబంధితశాఖల అధికారులకు పురమాయించారు. ఈ కార్యక్రమంలో ఉపకలెక్టర్ ఎస్.లవన్న, డిపివో ప్రభాకర్‌రావు, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్

ప్రకృతి వ్యవసాయంతో రైతుకు అదనపు ఆదాయం

● బుద్దాం యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ

కర్లపాలెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో వరితోపాటు ఆకుకూరలు, కూరగాయలు సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని బుద్దాం యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ అన్నారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయల అమ్మకాల కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిట్టు రవిశంకర్‌రెడ్డి, పి.నందిని, పి.శివపార్వతి, కె.భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

● జిల్లా బాలికల అభివృద్ధి అధికారి చారులత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలికల అభివృద్ధి అధికారి చారులత

బాపట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సెలవల సరదాను మరిచి నైపుణ్యాలను నేర్చుకోవటం వలన ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చునని జిల్లా బాలికల అభివృద్ధి అధికారి చారులత అన్నారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో సుమారు 40 ప్రభుత్వ పాఠశాలలో 10 రకాల వృత్తి విద్య కోర్సులతో 84మంది వృత్తి శిక్షకుల ద్వారా శిక్షణ ఇవ్వబోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 7,200 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని వీరిలో 900మంది విద్యార్థులు ఈదసరా ఇంటర్‌షిప్‌లో పాల్గొంటున్నారని తెలిపారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కొల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ జిల్లా రెండవ మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల నాయకుడు బి.సుబ్బారావు పిలుపునిచ్చారు. సోమవారం కొల్లూరులోని సచివాలయం వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు నల్ల చట్టాలను చేయాలన్న ఆలోచనతో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ నెల 27న రేపల్లెలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పులివర్తి సురేష్, శ్రీను, సుబ్బారావు, సరోజిని, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావిలంక గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

కొల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరద ఉధృతి నేపథ్యంలో కృష్ణానది మధ్యలో ఉన్న రావిలంక గ్రామాన్ని తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ అమరవర్థన్ సందర్శించారు. మండల పరిధిలోని పోతార్లంక నుంచి పడవలో రావిలంక గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ సోమవారం అక్కడి ప్రజలతో సమావేశమయ్యారు. ఎగువ నుంచి కృష్ణానదికి భారీగా వరద ప్రవాహం వచ్చే సూచనలు ఉన్నాయన్నారు. ఈ గ్రామంలో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సహాయం కావాలన్నా వెంటనే ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పడవలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సీఆర్‌పీలకు శిక్షణ కార్యక్రమం

చెరుకుపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం చెరుకుపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లోని ఎల్డీసిసెంటర్లో ఘనవ్యర్థాల నిర్వహణపై సీఆర్‌పీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెరుకుపల్లి, నగరం, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల సీఆర్‌పిలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రతి వెయ్యి కుటుంబాలకు ఒక సీఆర్పీని కేటాయించి వారు ప్రతిరోజు 50 కుటుంబాలకు డోర్‌టూడోర్ కలెక్షన్‌పై అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ శానిటేషన్ సిబ్బందికి అందించే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున్, గూడవల్లి పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన పెంకుటిల్లు పైకప్పు



కూలిన పెంకుటిల్లు పైకప్పు

కొల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షం ధాటికి పెంకుటిల్లు పైకప్పు కూలినట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం వల్ల పాముల రత్నంకు చెందిన పాత పెంకుటిల్లు పైకప్పు నాని ఒక్కసారిగా సగం మేరకు కూలింది. సమాచారం తెలుసుకున్న వీఆర్వో రామారావు సంఘటన స్థలానికి వెళ్లి పెంకుటిల్లును పరిశీలించారు. పాత పెంకుటిల్లు కావడంతో వర్షానికి నానిపోయి కూలినట్లుగా నివేదిక అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. పెంకుటింటిలో అన్నదమ్ముల ముగ్గురు కుటుంబాలు నివాసం ఉంటుండగా రత్నంకు చెందిన వైపు పెంకుటిల్లు కూలింది. దీంతో ఆ కుటుంబం నిరాశ్రయులు కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల పరిధిలోని భట్టిప్రోలు గ్రామానికి చెందిన షేక్ అమీర్‌కు రూ.31,883, కంభం వరప్రసాద్‌కు రూ.23 వేలు, పురం సునీతకు రూ.20 వేలు, చీకటి శైలజకు రూ.20 వేలు, ఐలవరం గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మకు రూ.20,100, దివి సూర్యావతికి రూ.20 వేలు, గుత్తావారిపాలేనికి చెందిన జంపని వెంకటేష్‌కు రూ.లక్ష, సూరేపల్లికి చెందిన బొర్రా ఝాన్సీలక్ష్మి రూ.52 వేలు, జిలుగువారిపాలేనికి చెందిన గాలి మోహన్‌బాబుకు రూ.37,878, పల్లికోనకు చెందిన శనగపల్లి బాలమురళీకృష్ణకు రూ.21,341, గొరికపూడికి చెందిన గుర్రం జయలక్ష్మికి రూ.18 వేలు, రాచూరుకు చెందిన చిలకా విమలమ్మకు రూ.20 వేల చెక్కులను గుంటూరు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పూర్తి హాజరు

వేమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తతతో పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ప్రధానంగా ఈ కార్యక్రమానికి ప్రతి అధికారి ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని, సమయపాలన పాటించకపోతే సహించేది లేదని కలెక్టర్ ముందస్తుగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సమయపాలన పాటిస్తూ అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఆన్‌లైన్ ద్వారా, అలాగే స్వయంగా అందిన అర్జీలను తహసీల్దార్ సుశీల పరిశీలించి సంబంధించిన అధికారులతో చర్చించి పరిష్కరించారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ని సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త మహిళల ఆరోగ్యాలకు సంజీవని లాంటి కార్యక్రమం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. మహిళలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పరివార్ అభియాన్‌తో మేలుజరుగుతుందని అన్నారు. అనంతరం యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌డెంటెంట్ డాక్టర్ పృధ్వీ గణేష్, చైతన్య తేజ, రత్నరాజు, ఆర్‌టీ భూషణ్, ప్రవలిక, డాక్టర్ ముమ్మలనేని రమేష్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు వాకా శివరామ్, ఆలపాటి వేణుగోపాల్, గుర్రం మురహరిరావు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా ఆరాధనోత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు, (కొల్లూరు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : షిరిడి సాయిబాబా 107వ ఆరాధనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. భట్టిప్రోలులోని షిరిడి సాయిబాబా ఆలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి అలంకరించేందుకు దాత బూరెల రాంప్రసాద్ రూ.14 వేలు విలువ కలిగిన వెండి కిరీటం అందించగా, మరో దాత నీలి యతేంద్రకుమార్, రేవతి దంపతులు (డెన్మార్క్) దత్తాత్రేయ పంచలోహ ఉత్సవ విగ్రహానికి రూ25 వేలు విలువ కలిగిన రజిత కిరీటం అందించారు. దేవస్థాన అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.


ఘనంగా దసరా నవరాత్రులు ప్రారంభం



కన్యకాపరమేశ్వరిఅమ్మవారి దేవాలయంలో బాలాత్రిపుర సుందరి అలంకారం

రేపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పలు దేవాలయాల్లో దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయాలలో దుర్గాదేవికి ఉదయం నుంచే విఘ్నేశ్వరపూజ, కుంకుమార్చన, లలితా సహస్రనామాలతో ఘనంగా ప్రారంభించారు. సోమవారం ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, పాతపట్నంలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో, రామకోటిపేట శివాలయంలో, బస్టాండ్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో, దుర్గమ్మవారికి కలశపూజ, కుంకుమపూజలు ప్రత్యేక హారతులు ఆయా ఆలయ అర్చకులు నిర్వహించారు. మండలంలోని పేటేరులో రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి దేవాలయంలో బావాజీమఠంలో ఆంజనేయస్వామి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యనిర్వహణాధికారి దివి వెంకటప్పలాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు.

● చెరుకుపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కావూరు రామలింగేశ్వరస్వామి, గుళ్ళపల్లి శ్రీగంగాంబికా సమేతస్వామి దేవస్థానం, నడింపల్లి శిఖరేశ్వర స్వామి దేవస్థానం, గూడవల్లి మైత్రేయాశ్రమంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



జంపని రామేశ్వరాలయంలో పార్వతీదేవికి విశేషాలంకరణ

● వేమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధి గ్రామాల్లోని ఆలయాలు, మందిరాలలో సోమవారం గణపతి పూజతో విశేష పూజా కైంకర్యాదులను ఆగమ శాస్త్ర ప్రకారం ప్రారంభించారు. జంపని రామేశ్వరాలయంలో పార్వతి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అబ్బనగూడవల్లి, చావలి గ్రామాల్లోని శివాలయాలలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. చావలి గోగులమ్మ, రామలింగేశ్వర, నూకాలమ్మ తల్లి ఆలయాలలో విశేష అలంకరణ జరిపారు. జంపని చెన్నకేశవాలయంలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఉత్సవాలు ప్రారంభించారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని సంకటివారి వీధిలో కాపు సంఘం మహిళ సభ్యులు కనకదుర్గ అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. సోమవారం పోతన శివనాగేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు పూజలు నిర్వహించారు. కొల్లూరు మండలం గాజుల్లంక గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లూరులోని పార్వతీదేవి ఆలయంలో అమ్మవారు స్వర్ణకవలాంకృతదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోటిపల్లిలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బాలత్రిపురసుందరిదేవి అలంకారం, భట్టిప్రోలులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీ అమ్మవారికి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అలంకారం, పార్వతీదేవి ఆలయంలో పార్వతీదేవిగా అలంకరించారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

● చుండూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వలివేరులో 10వ శతాబ్దం నాటి శ్రీలలితాంబ సమేత శ్రీ స్వయంభువేశ్వరస్వామి దేవాలయం, చినపరిమిలోని శ్రీగంగాపార్వతి సమేత శివాలయంలో, మోదుకూరులోని శ్రీకనకదుర్గ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్త శోభితంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ఈ నవరాత్రుల్లో వివిధ రూపాల్లో అలంకరించనున్నారు.

● అమృతలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దేవీశరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా సోమవారం ప్రారంభమైయ్యాయి. దేవాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పలు చోట్ల అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి 11 రోజుల పాటు శరన్నవరాత్రులు జరుపుతున్నారు. ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముకి అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి దసరా నవరాత్రుల మహోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. తొలిరోజు అమ్మవారిని శ్రీబాలత్రిపురసుందరిదేవిగా అలంకణగావించారు. ఒంగోలుకు చెందిన తెల్లబాటి శ్రీనివాసరావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారని ఆయన తెలిపారు. చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో దేవినవరాత్రుల మహోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ పార్వతి అమ్మవారిని బాలత్రిపురసుందరిగా అలంకరణగావించారు. శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలోని బాలాలయంలో గల శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. అల్లూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారిని సోమవారం శ్రీబాలతిపురసుందరిదేవిగా అలంకరించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంవి.ఎస్.వర్మ తెలిపారు. ఖాజీపాలెంలోని శ్రీకాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణాదేవిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించారు.



బాపట్ల చీలురోడ్డులో బాలత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నఅమ్మవారు

● బాపట్లరూరల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్లచీలురోడ్డులో ఉన్న రుక్మిణి సమేత పాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృత స్నాపన, అనంతరం విచ్చేసిన మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించినట్టు అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు తెలిపారు.

● కర్లపాలెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాలలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శ్రీ బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మతల్లి ఆలయం, శ్రీకాళీకమ్మతల్లి ఆలయం, చింతాయపాలెం, వాసవి కల్యాణ మండపాలలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో, పలు గ్రామాలలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని ఏర్పాటు చేశారు.



అమరావతి : రజిత కవచంతో దర్శనమిస్తున్న బాలచాముండికా అమ్మవారు



పెదకాకాని : బాల త్రిపుర సుందరీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు



మంగళగిరి : ఎర్రచెరువు వద్ద కొలువైన శ్రీ కాళీమాత అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

- శ్రీ బాలాత్రిపురసుందరీదేవి రూపంలో అమ్మవారి దర్శనం
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

గుంటూరు/నరసరావుపేట/మంగళగిరి సిటీ/పెదకాకాని/ అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దసరా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారి అలంకారాలను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న శ్రీ కన్యకా పర మేశ్వరి ఆలయంలో అమ్మవారు తొలి రోజున శ్రీ బాలత్రిపుర సుంద రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని పాతూరు శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకారం చేశారు. అమరావతి శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని రజిత కవచధారిణిగా అలంకరించారు. పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.




నరసరావుపేట : శ్రీ శృంగేరి శంకర మఠంలో బ్రహ్మి అలంకారంలో అమ్మవారు



గుంటూరు : శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

విజ్ఞాన అమరావతి



- రాజధానిలో ప్రపంచ ఖ్యాతి సెంట్రల్ లైబ్రరీ

రాజధాని అమరావతి అంటేనే మరో ప్రపంచమన్న నానుడి ఇటీవలి కాలంలో బాగా ప్రబలమైపోయింది. ఇక్కడ ఏ నిర్మాణమైనా.. అది అంతర్జాతీయ ప్రమాణాలతో.. ప్రపంచ మేటిగా ఉండాలన్న లక్ష్యంగా సాగుతోంది. ఇపుడు తాజాగా రాజధాని అమరావతిలో అతి పెద్ద గ్రంథాలయం ఆవిర్భవించబోతున్నట్టు రాష్ట్ర విద్యా, ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ గ్రంథాలయం సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతుంది. ఈ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అయిదు నుంచి పదెకరాల స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటన చేసినా.. రాజధానిలో దానిని ఏ ప్రాంతంలో నిర్మిస్తున్నారనే అంశమై స్పష్టత ఇవ్వలేదు. అయితే అమరావతిలోని నవ నగరాల్లో ఒకటైన నాలెడ్జి సిటీలోనే దీనిని నిర్మించాల్సి ఉంటుంది. నాలెడ్జి సిటీ విస్తరించిన తుళ్లూరు, శాఖమూరు, ఐనవోలు, మల్కాపురం ప్రాంతాల్లోనే ఈ సెంట్రల్ లైబ్రరీ ఆవిష్కృతమయ్యే అవకాశముంది.

- రూ.150 కోట్లతో అద్భుతంగా నిర్మాణం
- జ్ఞాన కేంద్రంగా... టెక్నాలజీ హబ్‌గా..
- అత్యాధునిక వసతులతో రెండేళ్లలో పూర్తి..
- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతిలో ఏర్పాటుకానున్న ఈ సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించనుంది. ప్రస్తుతానికి కోల్‌కతాలో ఉన్న నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా అతిపెద్దదిగా ప్రాచుర్యంలో ఉంది. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, తంజావూరులోని సరస్వతీ మహల్ లైబ్రరీ ఉన్నాయి. సరస్వతీ మహల్‌కున్న మరో అరుదైన ప్రాముఖ్యత దేశంలోని వివిధ ప్రాంతీయ భాషల్లో ఉన్న తాళపత్ర గ్రంథాలు ఇక్కడ కచ్చితంగా అందుబాటులో ఉంటాయి. అందుకే సరస్వతీ మహల్‌కు జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు అమరావతిలో రూపుదిద్దుకోనున్న సెంట్రల్ లైబ్రరీ కూడా అటు విస్తీర్ణంలోను, ఇటు కేటలాగ్‌లోనూ అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించడంతోపాటు అత్యాధునిక వసతులతో సాంకేతిక విలువలతో అగ్రగామిగా నిలవనుంది. మంత్రి లోకేశ్ మాటల్లో చెప్పాలంటే....దీనిని ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



సెంట్రల్ లైబ్రరీ గురించి అసెంబ్లీలో ప్రకటన చేస్తున్న మంత్రి నారా లోకేశ్

అడుగులు పడింది ఇలా...

రాష్ట్రంలో సెంట్రల్ లైబ్రరీ ఆవశ్యకతను గురించి మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు రాష్ట్రంలో గ్రంథాలయాల పునర్వికాస ప్రక్రియ చాల ఆవశ్యమన్న విషయాన్ని బుద్ధప్రసాద్ మంత్రి లోకేశ్ వద్ద ప్రస్తావించారు. ఆయన సెంట్రల్ లైబ్రరీ అంశమై సానుకూలంగా స్పందిస్తూ గత ఆగస్టు 22న ఓ ప్రకటన చేశారు. తాజాగా అసెంబ్లీ సమావేశంలో మంత్రి లోకేశ్ మరోమారు సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు ప్రక్రియను వివరించారు. అమరావతిలో రూ.150 కోట్ల భారీ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి గ్రంథాలయంగా దీనిని నిర్మిస్తామని చెప్పారు. త్వరలోనే నిర్మాణం ప్రారంభించి.. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని అన్నీ గ్రంథాలయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు మాన్యు స్క్రిప్ట్ కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచే అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటూ.. రాబోయే ఆరుమాసాల్లోనే గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నామని లోకేశ్ సభలో వివరించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం ఉన్న 13 జిల్లా గ్రంథాలయాలతోపాటు నూతనంగా ఏర్పాటైన జిల్లాల కేంద్రాల్లో కూడా గ్రంథాలయాలను నిర్మిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఇప్పటికే చేపట్టిన మోడల్ లైబ్రరీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, అక్టోబరులో దానిని ప్రారంభిస్తామని చెప్పారు.

లైబ్రరీ ప్రత్యేకతలు ఎన్నెన్నో...

అమరావతిలో ఏర్పాటు కానున్న సెంట్రల్ లైబ్రరీ రాష్ట్ర ఖ్యాతిని మరింత ఇనుమడించేలా ఉండాలన్నది.. ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందుకోసం భవన నిర్మాణం మొదలు.. అందులోని సదుపాయాలన్నీ అత్యంత ఆధునికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీ, ఈ -బుక్స్ యాక్సిస్, ఇంటర్నెట్ ల్యాబ్స్, స్టడీ రూమ్స్, గ్రూప్ డిస్కషన్స్‌కు ఉపకరించేలా హాల్స్, ఆడియో అండ్ వీడియో విజువల్ రిసోర్స్ సెంటర్ల వంటి అన్నీ వసతులను ఇక్కడ అందుబాటులోకి తెస్తారు. అలాగే వివిధ రకాల పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక విభాగాలు, సైలెంట్ రీడింగ్ రూమ్స్, రిఫరెన్స్ విభాగాలు ఈ లైబ్రరీ ప్రత్యేకతలుగా ఉంటాయి. కేవలం విద్యార్థుల కోసమే కాకుండా వివిధ రంగాలపై పరిశోధన పత్రాలు, గణాంకాలు, ఈ-జర్నల్స్, ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్, ప్రాచీన గ్రంథాలన్నీ అందుబాటులో ఉంటాయి. ఇంతే కాకుండా వయసు రీత్యా వివిధ కేటగిరీల వారీగా కూడా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసే ప్రణాళిక ఉంది. చిన్నారుల కోసం కిడ్స్ కార్నర్, సీనియర్ సిటిజన్‌ల కోసం రిఫరెన్స్ లాంజ్, సాంకేతిక విద్యలో రీసెర్చి కోసం ఐటీ, సాఫ్ట్‌వేర్ సంబంధిత పుస్తకాలతో కూడిన విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు.

అమరావతి ఖ్యాతిని ఇనుమడించేలా...

ప్రపంచశ్రేణి నగరాల్లో ఒకటిగా బాసిల్లనున్న అమరావతికి ఈ సెంట్రల్ లైబ్రరీ పెద్ద వనరుగా ఉపకరించనుంది. రాబోయే రోజుల్లో ఈ లైబ్రరీ వేదికగా అంతర్జాతీయ సదస్సులు, సాహిత్య ఉత్సవాలు, మరెన్నో పరిశోధనా కార్యక్రమాలు జరుగుతాయి. అమరావతిని జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ గ్రంథాలయం ఎంతో దోహదపడనుంది.

బీచ్ ఫెస్టివల్ వాయిదా

- భారీ వర్షాల సూచనల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తున్నట్లు టూరిజం విభాగం జిల్లా అధికారి నాగి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కూడా బీచ్ పండుగకు హాజరవుతారని గతంలోనే యంత్రాంగం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. అయితే ఈ వారంలో అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీచ్ ఫెస్టివల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి సోమవారం సూర్యలంక తీరానికి వచ్చారు. ఈ నెల 26, 27వ తేదీల్లో వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ప్రతికూల పరిస్థితుల్లో బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం కష్టమేననే అభిప్రాయాన్ని ఎండీ ముందు జిల్లా యంత్రాంగం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇవే అంశా లను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో వేరే తేదీల్లో బీచ్ పండుగను నిర్వహిస్తామని పర్యాటకశాఖ తెలిపింది.



సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ వినోద్‌కుమార్

బ్రహ్మోత్సవాల్లో సామాన్యులకే ప్రాధాన్యం

- 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

కలియుగ వైకుంఠం తిరుమల బ్రహ్మోత్సవ సంరంభానికి సిద్ధమైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక మేరకు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల పవిత్రత కాపాడుకుంటూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దానికి అనుగుణంగా బోర్డు సభ్యులు, అధికారులందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నాం. ఎస్ఎస్‌డీ (స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్ల కోటా పెంపుతో పాటు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్లు అధికంగా ఇచ్చాం. నేరుగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకే అధిక సంఖ్యలో గదులు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వాహన సేవలు వీక్షించేందుకు మాడవీధుల్లోకి వచ్చే, వెలుపల ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాల వితరణ, 110 మందితో వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాం.

పటిష్ఠ భద్రత


సెక్యూరిటీ పేరుతో మాడ వీధుల్లోకి భక్తులు ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పెట్టకూడదని నిర్ణయించాం. భద్రత కల్పనలో లోపాలు లేకుండా దాదాపు 6 వేల మందితో సేవలందించాలని ఆదేశాలిచ్చాం. గరుడ సేవ రోజు అదనంగా మరో 1,300 మంది బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిద్వారా రియల్ టైంలో మానిటర్ చేస్తాం. కమాండ్ కంట్రోల్ రూం నుంచి అన్నిటినీ నిరంతరాయంగా పరిశీలిస్తుంటారు.

సమన్వయ లోపాలకు చెక్

టీటీడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో కొన్ని బృందాలను ఏర్పాటు చేశాం. వారు మాడ వీధుల్లోని గ్యాలరీల వద్ద సెక్టార్ల వారీగా విధులు నిర్వహిస్తారు. భక్తులతో నేరుగా మాట్లాడతారు. ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తారు. శ్రీవారి సేవకులు కూడా గ్యాలరీల్లోనే ఉంటూ భక్తులకు సేవలందించడంతో పాటు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తారు. ఈసారి సమన్వయ లోపానికి ఆస్కారం లేదు.

రూ.25 కోట్లతో ఏర్పాట్లు

సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా సంతృప్తికర, ఆధ్యాత్మిక, ఆహ్లాదకర సంతోషాన్ని కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. గతానికంటే భిన్నంగా రూ.25 కోట్లతో ఈసారి ఏర్పాట్లు చేపట్టాం. రూ.9.50 కోట్లతో ఇంజనీరింగ్ పనులు, రూ.5.30 కోట్లతో విద్యుద్దీపాలంకరణలు చేపట్టాం. దాతల సహకారంతో మరో రూ.3.50 కోట్లతో 60 టన్నుల పుష్పాలతో అలంకరణలు చేయనున్నాం. అన్న ప్రసాదాలు, ఇతర ఖర్చులకు రూ.25 కోట్లతో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాం.



4 వేల వాహనాలకు పార్కింగ్ సిద్ధం

4 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ప్రదేశాలను తిరుమలలో సిద్ధం చేశాం. అంతకు మించి వస్తే తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తాం. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ 1,900 ట్రిప్పులు, గరుడ సేవ రోజున మూడు వేల ట్రిప్పులను తిప్పేందుకు ఆర్టీసీ ప్లాన్ చేసింది.

కార్నర్ పాయింట్స్ నుంచి దర్శనం

మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.80 నుంచి దాదాపు 2 లక్షల మంది కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముంటుంది. రెండేళ్ల నుంచి మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను క్యూలైన్ ద్వారా అనుమతించి దర్శనం కల్పిస్తున్నాం. 45 నిమిషాల పాటు వాహనాన్ని కార్నర్ పాయింట్లలో ఉంచి హోల్డింగ్ పాయింట్ల ద్వారా భక్తులను అనుమతించి దర్శనం చేయిస్తాం. గతేడాది ఈ పాయింట్ల ద్వారా 16 వేల మందికి దర్శనం చేయిస్తే ఈసారి దాదాపు 30 వేల మందికి దర్శనం చేయించేలా ప్రణాళిక రూపొందించాం.

298 కళా బృందాల ప్రదర్శనలు

దాదాపు 28 రాష్ట్రాల నుంచి 298 బృందాలు ఉత్సవాల్లో పాల్గొంటాయి. గరుడ వాహన సేవ రోజు 20 రాష్ట్రాల నుంచి 37 బృందాలు ప్రదర్శనలు ఇస్తాయి. 20 హెల్ప్ డెస్కుల ద్వారా ఐదు భాషల్లో ప్రసారాలు ఇవ్వడంతో పాటు టీటీడీ అందిస్తున్న సేవలను భక్తులకు వివరిస్తాయి.

పూర్వ జన్మ సుకృతం

రెండవసారి టీటీడీ ఈవోగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఒక్కసారి ఈవో కావడమే పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటిది నేను రెండోసారి ఈవో అయ్యాను. మొదటిసారి ఈవోగా నియమితమైనప్పుడు చాలా మంది నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ అంటూ చర్చలు పెట్టారు. కానీ రెండోసారి ఈవోగా వస్తుంటే చాలా మంది స్వాగతించారు. ఇప్పటికే నాలుగు బ్రహ్మోత్సవాలు పూర్తిచేసిన అనుభవంతో ఐదో బ్రహ్మోత్సవాన్ని వైభవంగా, వివాదరహితంగా నిర్వహిస్తాననే గట్టి నమ్మకముంది.

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు!

(5వ పేజీ తరువాయి)

70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి.



రకరకాల ఫీజుల మోత..!

ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్‌చేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

● వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..!

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

● రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థ లు క్రమంగా రిటర్న్ విండోను మూ సేస్తున్నాయి. తొలి నాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ,



లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిదంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! ఆథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

విజ్ఞాన్‌లో కొనసాగుతున్న జాతీయ చెస్ చాంపియన్‌షిప్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది బరిలోకి దిగినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కె జగదీష్ వెల్లడించారు. వారిలో 391 మంది రేటెడ్ ప్లేయర్లు ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సాహూను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు.



పోటీల్లో పాల్గొన్న చెస్ క్రీడాకారులు

కారుమంచి మేజర్ కర్షకుల కడ'గండ్లు'

నాలుగేళ్ల క్రితం క్వారీ గుంతలోకి కుప్పకూలిన కెనాల్

పునరుద్ధరణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఎన్నికలనాటి హామీ అమలుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి

రూ.2.60కోట్లు డీఎంఎఫ్ నిధులు మంజూరు

టెండర్లు పిలిచే దశలో సీఈ అత్యుత్సాహంతో సీన్ రివర్స్

కట్ట కూలటానికి కారణమైన క్వారీ యాజమాన్యంతో ఆయన సంప్రదింపులు

ఈ పరిస్థితుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిన ఇరిగేషన్ శాఖ రాష్ట్ర సెక్రటరీ

జలాశయాల్లో నిండుగా నీళ్లున్నా రైతులకు ఒనగూరని ప్రయోజనం

నేడు చలో కలెక్టరేట్‌కు పిలుపు

చీమకుర్తి,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఇరిగేషన్‌శాఖ జిల్లా అధికారులు, నాలుగు మండలాలలో ఉన్న అధికార పక్ష నాయకులు వీరందరి ఆశయాన్ని ఒక్క అధికారి నిర్వాహకం నీరుగార్చేలా చేసింది. రైతులతో పాటు వేలాది మంది ప్రజలకు గుక్కెడు తాగునీళ్లు ఇవ్వలేని పరిస్థితిని కల్పించింది. నాలుగు మండలాల పరిధిలో దాదాపు ఇరవై వేల ఎకరాల ఆయకట్టు, పద్దెనిమిది గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే కారుమంచి మేజర్ కట్ట.. క్వారీయింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రానైట్ యాజమాన్యం నిర్వహించిన కార్యకలాపాలతో కూలిపోయింది. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మేజర్ పరిధిలో ఉన్న ప్రాంతం సింహభాగం తెలుగుదేశం వారే ఉన్నారన్న ఏకైక కారణంతో కాలువ పునరుద్ధరణను గాలికి వదిలేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రస్తుత ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రజల ఆవేదన గమనించి చలించిపోయారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కారుమంచి కెనాల్ పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలవటంతో వెంటనే కారుమంచి కెనాల్ పునరుద్ధరణపై దృష్టి సారించారు.



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎన్ఆర్‌ఐలు నల్లూరి వెంకట శేషయ్య, తక్కెళ్లపాటి రమేష్

కాలువ ఆయకట్టు గ్రామం కేవీ పాలేనికి చెందిన ఎన్ఆర్‌ఐ నల్లూరి వెంకటశేషయ్య తన సొంత నిధులు దాదాపు రూ.25లక్షలను ఖర్చుపెట్టి కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేసి 30 క్యూసెక్కులు నీరు వెళ్లేలా చేశారు. మేజర్ పరిధిలో ఉన్న బూసరపల్లి గ్రామానికి చెందిన మరో ఎన్ఆర్‌ఐ తక్కెళ్లపాటి రమేష్, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలువను సందర్శించారు. కట్ట శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయాలని నాటి కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి కుప్పకూలిపోయిన కట్టను పరిశీలించారు. తక్షణమే కట్ట పునరుద్ధరణకు డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి రూ.2.60కోట్లు నిధుల అవసరమని నివేదికను అందచేశారు. ఈ నిధులు మంజూరుకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఫైల్‌ను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వద్దకు తీసుకెళ్లి రైతుల కష్టాను వివరించి ఆమోదింపచేశారు. ఇక టెండర్లు పిలవటమే తరువాయి అన్న తరుణంలో సీన్ రివర్స్ అయింది.

కథ నడిపిన సీఈ

నిధులు మంజూరు కావటంతో టెక్నికల్ అనుమతులు కోసం ఇరిగేషన్ శాఖాధికారులు సీఈకి నివేదించారు. వెంటనే ఆమోదం తెలపాల్సిన సదరు ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. కట్ట కూలిపోవటానికి కారణమైన క్వారీ యాజమాన్యానికే ఆయన కట్ట పునరుద్ధరణపై అధికారికంగా లేఖ రాయటం సమస్యను తెచ్చిపెట్టుకున్నట్లయింది. 2023లో క్వారీ యాజమాన్యం అప్పటి ప్రభుత్వానికి ఓ వినతిపత్రం అందచేసింది. కట్ట కూలిన ప్రాంతాన్ని తమకు అప్పగిస్తే కాలువ వెళ్లే మార్గాన్ని మార్చి కొత్తగా కాలువను తమ ఖర్చులతో పునరుద్ధరిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో క్వారీ యాజమాన్యం మౌనం దాల్చింది. ఇప్పటికే ఈ క్వారీలో అనుమతించిన దానికంటే ఎక్కువ లోతులో అదీ బఫర్ జోన్ నిబంధనలను ఉల్లంఘించి ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న భూమిలోకి వచ్చి మరీ క్వారీయింగ్ చేయటంతో కట్ట కూలిపోవటానికి ప్రధాన కారణమైందని అపుడు విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఈ పరిస్థితుల్లో కట్ట కూలటానికి కారణమైన వారితో ఇరిగేషన్ ఉన్నతాధికారి సంప్రదింపులు జరపటం ఏమిటో అంతుచిక్కడం లేదు. సీఈ రాసిన ఉత్తరానికి క్వారీ యాజమాన్యం ఇచ్చిన సమాధానం మరింత విస్తుగొలిపేలా ఉంది. కాలువ ప్రవాహ మార్గాన్ని మార్చి నూతన మార్గానికి అవసరమైన భూమిని సేకరించి తమకు అప్పగించటంతో పాటు కూలిన ప్రాంతాన్ని తమకు ఇస్తే తామే కట్ట పునరుద్ధరిస్తామని తాపీగా సమాధానం ఇచ్చింది. కాలువ మార్గాన్ని మార్చటానికి ఎటువంటి అవకాశం లేని పరిస్థితి ఇక్కడ ఉంది. కాలువకు ఇరువైపులా గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. వారి భూముల నుంచి కాలువ వెళ్లటానికి ఒప్పుకొనే పరిస్థితి లేదు. ఇక్కడి పరిస్థితులను వాకబు చేయకుండా ఏకపక్షంగా క్వారీ యాజమాన్యం ప్రతిపాదించిన ప్రతిపాదనకు ఏకీభవించిన సదరు అధికారి దానిని రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. తదనుగుణంగా ఇరిగేషన్ సెక్రటరీ సీఈ ఇచ్చిన నివేదిక మేరకు తాము తిరిగి ఆదేశాలు ఇచ్చే వరకూ కట్ట పునరుద్ధరణపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వులు జిల్లా అధికారులకు జారీచేశారు. దీంతో కారుమంచి కథకంచికి చేరింది. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి, ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, జిల్లా ఇరిగేషన్ అధికారుల సానుకూలతలు అన్ని బుగ్గిపాలయ్యాయి.



క్వారీలో విరిగిపడిన కారుమంచి మేజర్ కాలువ

ఆయకట్టు రైతాంగం ఆక్రందన...

కారుమంచి మేజర్ పరిధిలో దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 18 గ్రామాలకు తాగు నీటి సరఫరా చేయాల్సి ఉంది. కెనాల్ కుప్పకూలక ముందు కాలువ ద్వారా రామతీర్థం జలాశయం నుంచి 130 క్యూసెక్కులు సరఫరా అవుతాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకొనేవారు. కాలువ కూలిన తర్వాత తాత్కాలికంగా కాలువను బైపాస్ చేసి పట్టలు కప్పి 30 క్యూసెక్కుల మేర నీటిని ఎంతో కొంత ఉపశమనం కల్గించేలా అప్పటినుంచి సరఫరా చేస్తున్నారు. దీనివలన పంటలకు సరిపడా నీరందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం జలాశయాలు నిండుగా ఉన్నా కారుమంచి మేజర్ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

ఉద్యమానికి సిద్ధమైన రైతులు

తమ కష్టాలు గట్టెక్కుతున్నాయి.. కారుమంచి మేజర్ పునరుద్ధరణ పనులు ప్రారంభం కాబోతున్నాయి అని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు పనులు ప్రారంభయ్యే అవకాశం లేదన్న వార్త తెలిసి రగిలిపోతున్నారు. ఐక్య కార్యాచరణ ఉద్యమానికి రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఆయకట్టు రైతులు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తదుపరి ఉన్నతాధికారుల నుంచి స్పందన రాకపోతే చలో అసెంబ్లీ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ మంత్రి రామానాయడుని ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకోవాలని యోచిస్తున్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద కోరారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీఆర్‌ఏలకు పేస్కేలును అమలు చేయడంతోపాటు నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన వారందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల వంటి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా సంఘం నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆయా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండలరావు, వేణు, నరసింహరావు, సామేలు, పవన్, శ్రావణి, శారద, సుజాత తదితరులు ఉన్నారు.

గుండ్లకమ్మ పదిగేట్లు ఎత్తివేత



గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

మద్దిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సోమవారం 25వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. 10 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కారణంగా ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామని, వరద ఉధృతి పెరిగితే మరో గేటు ఎత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదు

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐ బీఎస్‌పీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. సోమవారం డివిజనల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందుకు సంబంధించి సంబంధిత అధికారికి అక్కడికక్కడే సిఫారసు చేశారు. అర్జీల విచారణలో పారదర్శకత పాటించాలని, ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే ఏఐ బీఎస్పీ ప్రతినిధులు గాంధీనగర్‌లో యానాది కాలనీ వాసులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన అర్జీను స్వీకరించి ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ



మొక్కల పంపిణీ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత ఎల్ఐసీ కార్యాలయం ఆవరణంలో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేప, రాగి, జామ, చింత, గోరంటాకు, రావి నేరేడు, పూలమొక్కలను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరావు తెలిపారు. దాదాపు 500 మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, లేవీ ప్రసాద్, అంజాద్ బాషా, మహమ్మద్ రఫీ, రామకోటేశ్వరరావు, లక్ష్మిరెడ్డి, దేవపాలన, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● సీడీపీవో ఎలిజబెత్‌రాణి



చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీవో ఎలిజబెత్‌రాణి

పంగులూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోషకారంతో సంపూర్ణఆరోగ్యం లభిస్తుందని కొరిశపాడు సీడీపీవో ఎలిజబెత్‌రాణి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ రాగులు, సజ్జలు, జొన్నలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలన్నారు. తల్లిపాలతోపాటు రాగిజావలాంటి పదార్థాలు పిల్లలకు శక్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, సుజాత, శ్యామల, ప్రసన్నకుమారి, సుధారాణి, ఏఎన్ఎం రామాంజమ్మ, గర్భిణులు, బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ యద్దనపూడి మండల నూతన కమిటీ ఎంపిక సోమవారం యద్దనపూడిలో నిర్వహించారు. కమిటీ కన్వీనర్‌గా దారా బాబూరావు, కో-కన్వీనర్‌గా టి.జ్యోత్స్న, కమిటి సభ్యులుగా ఎస్‌కె కరిముల్లా, టి.అశోక్ కుమార్, ఎస్‌కే.సత్యా, పి కుమార్, టి రమాదేవి, తదితరులను ఎంపికచేశారు. కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆన్‌లైన్ అమ్మ'కం..బాదుడు'!

(5వ పేజీ తరువాయి)

70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి.

రకరకాల ఫీజుల మోత..!

ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్‌చేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

● వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..!

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

● రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థలు క్రమంగా రిటర్న్ విండోను మూసేస్తున్నాయి. తొలినాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ, లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిదంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! ఆథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

సేంద్రియ కూరగాయలతోనే ఆరోగ్యం

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సోమవారం సేంద్రియ కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా వ్యవసాయ అధికారి వడ్డే రాము మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యం ఇంటి ఇల్లాలిపై ఆధారపడి ఉంటుందని ప్రతి ఒక్కరూ చిన్న స్థలాల్లోనే సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించి తమకు అవసరమైనవి సమకూర్చడంతో పాటు ఆదాయం కూడా పొందవచ్చునని, మహిళలు ఇంటి వద్ద సేంద్రియ కూరగాయలు పండించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మందాకిని, జ్యోత్స్న, విజయలక్ష్మి, నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పి హర్షవర్ధన్ రాజు

పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పొన్నలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ సమస్యలపై ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో వివిధ కేసుల వివరాలు, ఇతర సమస్యలపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పలు సూచనలు చేశారు. మండలంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వర్షాల నేపథ్యంలో బీచ్ ఫెస్టివల్ రద్దు

భారీ వర్షాల సూచనతో నిర్ణయం



సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను రద్దు చేస్తున్నట్లు టూరిజం విభాగం జిల్లా అధికారి నాగిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కూడా బీచ్ పండుగకు హాజరవుతారని గతంలోనే యంత్రాంగం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. అయితే ఈ వారంలో అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ఫెస్టివల్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీచ్ ఫెస్టివల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి సోమవారం సూర్యలంక తీరానికి వచ్చారు. ఈ నెల 26, 27వ తేదీల్లో వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ప్రతికూల పరిస్థితుల్లో బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం కష్టమేననే అభిప్రాయాన్ని ఎండీ ముందు జిల్లా యంత్రాంగం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇవే అంశాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బీచ్ ఫెస్టివల్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో వేరే తేదీల్లో బీచ్ పండుగను నిర్వహిస్తామని పర్యాటకశాఖ తెలిపింది.

ఆదమరిస్తే అంతే సంగతులు

ముక్తేశ్వరం- రామాంజనేయపురం మధ్య పొంచి ఉన్న ప్రమాదం



ముక్తేశ్వరం రామాంజనేయపురం రోడ్డులో కాలువ వద్ద గుంత

బల్లికురవ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్తేశ్వరం రామాంజనేయపురం గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డులో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రోడ్డులోని మేజర్ కాలువపై గతంలో కురిసిన వర్షాలతో పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డులో ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే మలుపు అంచులలోని గుంత వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. వేగంగా వచ్చే వారు కాలువలోకి పడి పోతున్నారు. దీంతో రైతులు గుంత ఉన్న కాలువ వద్ద ముళ్ల కంప వేశారు. రైతులు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణం చేయటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చించాలని రైతులు కోరుతున్నారు.



గుంత వద్ద ముళ్ల కంప పెట్టిన ప్రజలు

జీఎస్టీ తగ్గింపుతో బీజేపీ సంబరాలు



టపాసులు పేల్చి సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సోమవారం నుంచి అమలులోకి వచ్చిన వస్తు సేవల పన్ను-2 వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయన్నారు. 395 రకాల వస్తువుల ధరలు భారీగా తగ్గించడం వల్ల మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు మాకినేని నరసింహం, సీతారామయ్య, బి. విజయారావు, శ్రీలక్ష్మి, జిల్లెళ్ళమూడి రమాదేవి, రాజేష్ వర్మ, మోజేష్, రాధాకృష్ణ, సత్యనారాయణ, గుర్రం రంగనాథ్, కొమ్ము శ్రీనివాసరావు, రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఒడా చైర్మన్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఎస్పీ హర్షవర్ధన్‌రాజును జనసేనపార్టీ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం హర్షవర్ధన్‌రాజును కలిసి శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అదే విధంగా రవిశంకర్ గ్రూపు అధినేత, జనసేనపార్టీ నాయకులు కంది రవిశంకర్, ఒంగోలు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ చిట్టెం ప్రసాద్‌లు ఎస్పీని కలిసి శాలువతో సత్కరించారు.



ఎస్పీ హర్షవర్ధన్ రాజును సన్మానిస్తున్న ఒడా చైర్మన్ రియాజ్

శనగల నిల్వలను కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో రైతుల వద్ద నిల్వలు ఉన్న శనగలను పదివేల రూపాయలకు కొనాలని లేకుంటే మూడు వేలరూపాయలు బోనస్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు, కిసాన్ సంయుక్త మోర్చ నాయకులు హనుమారెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులో కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో శనగ రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లాలో అత్యధికంగా శనగ పంట సాగు చేశారని, ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేశారని అన్నారు. ప్రస్తుతం ధర దిగజారి నందున కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉన్న శనగలను పది వేలకు కొనాలని లేదా మూడు వేలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని తీర్మానించారు.

అవీ..ఇవీ..

నిషేధిత జాబితా నుంచి విముక్తి

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):అద్దంకిపట్టణంలోని ఉత్తర అద్దంకి 1038 సర్వే నంబరులో దేవాలయాల స్థలాలు పోను మిగిలిన భూమిని సబ్‌డివిజన్ చేసి నిషేదిత జాబితా నుండి తొలగించినట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఆరు దేవాలయాలకు సంబంధించిన స్థలాలను సబ్ డివిజన్ చేసి మిగిలిన విస్తీర్ణంలో క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పిస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు. కొంతకాలంగా నిలిచిపోయిన క్రయ, వి క్రయాల రిజస్ట్రేషన్లకు అడ్డంకులు తొలగిపోయాయి.

నేడు మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు స్వచ్ఛత హీ సేవా-2025 కార్య క్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన అవసరం



పుస్తకాలను అందజేస్తున్న హెచ్‌ఎం గంగాధర్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం పి.గంగాధరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రారంభం అవుతున్న ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను హెచ్‌ఎం అందజేశారు. ఈ క్రమంలో మూడు గ్రూప్‌ల విద్యార్థులు అద్దంకి పట్టణంలోని పలు దుకాణాల వద్ద అవగాహన కల్పించి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకోవాలి



ప్రత్యామ్నాయ పంటల బ్రోచరును ఆవిష్కరిస్తున్న విజయనిర్మల

మార్టూరు, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని ఆత్మ డీపీడీ కే.విజయనిర్మల అన్నారు. సోమవారం మార్టూరులో వ్యవసాయమార్కెట్ యార్డులో ప్రకాశం జిల్లా ఆత్మ వారి సౌజన్యంతో మార్టూరు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కోసం రైతులతో కిసాన్ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏవో లావణ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయనిర్మల రైతులకు పొలంబడి, విజ్ఞానయాత్రలు, ప్రదర్శనా క్షేత్రాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, రబీ కాలంలో సోయా చిక్కుడు, మినుము, శనగ పంటలను సాగుచేయాలన్నారు. తరువాత లాం శాస్త్రవేత్త ఉమాదేవి మాట్లాడుతూ మార్కెట్ ధరలకు అనుగుణంగా పంటల సాగు చేయాలన్నారు. అనంతరం ఏడీఏ సుదర్శనరాజు మాట్లాడుతూ యూరియా అధిక వినియోగాన్ని తగ్గించాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు అధికారులు అందరూ సహకరించాలన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ వెలగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులను ఇవ్వాలన్నారు. తదనంతరం ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన బ్రోచర్లను అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మాధవీలత, ఉద్యానశాఖ అధికారి హనుమంత నాయక్, రైతుసంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, పెంట్యాల శరత్, రాజశేఖర్, ఏఈవో రాధాకృష్ణ, అక్షర, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

చినగంజాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీ నుండి అక్టోబరు 2వ తేది వరకు కడవకుదురు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సీజన్-2 రెడ్ టెన్నిస్ బాల్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలైన టీంకు మొదటి బహుమతి రూ.25,000లు, రెండవ బహుమతి రూ.20,000లు, మూడవ బహుమతి రూ.15,000లు, నాలుగవ బహుమతి రూ.10,000లు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు శ్యామ్ సెల్ నెంబరు 86883 69827, హర్ష సెల్ నెంబరు 9390012789లను సంప్రదించాలన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్యామల

మార్టూరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల వయస్సులోపు పిల్లల మెదడుపై ప్రభావం చూపే విధంగా పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు అందించే విధంగా అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ శిరీష పేర్కొన్నారు. సోమవారం మార్టూరులో మద్దిసీతాదేవినగర్‌లో అంగనవాడీ కేంద్రంలో పిల్లలు తల్లులు, అంగనవాడీ కార్యకర్తలతో శిరీష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్లీ చైల్డ్ కేర్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త అంజలి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరులో నేతాజీనగర్, రామ్‌నగర్‌లో అంగనవాడీ కార్యకర్తలు రాజ్యం, అరుణ, సుశీలల ఆధ్వర్యంలో పిల్లల తల్లులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుగాలి కాలనీలో కార్యకర్త రాజేశ్వరి, కిషోర్ కాలనీలో శ్యామల,ముస్లిం కాలనీలో దయమ్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఇంకా మార్టూరులోని మిగిలిన అంగనవాడీ కేంద్రాలలో కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సంతమాగులూరు, సెప్టెంబర్ 22, (ఆంధ్రజ్యోతి) మండలంలోని వేల్చూరు గ్రామపంచాయతీలోని రామిరెడ్డిపాలెంలో 8వ రాష్ట్రీయ పోషణ వార్షికోత్సవం సీడీపీవో సుధారాణి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ జి.ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. పోషణ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం బొమ్మల కొలువులో భాగంగా పేరెంట్స్ ను ఆహ్వానించి, వర్ణమాల బొమ్మల కొలువులు "అ నుండి ఱ వరకు"ప్రతి అక్షరానికి సంబంధించిన చిత్రాలను చూపించారు. వాళ్ల పిల్లల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుమల, ఇందిరా, చిన్నమ్మ, దుర్గ, బసవమ్మ, బోడెమ్మ పద్మ, షకీరా, అపర్ణ, మస్తానమ్మ, మస్తాన్‌బీ, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

స్మార్టుకార్డులతో బహుళ ప్రయోజనాలు

- మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్
- సమస్యలపై సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం



స్మార్ట్‌కార్డులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డులతో లబ్ధిదారులకు బహుళ ప్రయోజనాలున్నాయని, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం అద్దంకిలో పలువురు లబ్ధిదారులకు కార్డులను అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రేషన్ కార్డులపై కూడా తన ఫొటో ముద్రించుకున్నాడన్నారు. ప్రస్తుతం స్మార్ట్‌కార్డుల ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాల జరగకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ ఉదయం, సాయంత్రం సమయంలో నామ్ రోడ్డు లో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఉంచాలన్నారు. త్వరలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతా మన్నారు. దీని ద్వారా కొంత మేర ట్రాఫిక్ మరల్చ వచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న పాత భవనాలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ రవీంద్రకు మంత్రి రవికుమార్ సూచించారు. పలువురి నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నారు. కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఆర్ఐ శంకర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్ పాల్గొన్నారు.

అద్దంకి: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సచివా లయ ఉద్యోగులకు తక్కువ జీతాలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీతాలు పెంచిం దని సాంఘిక సంక్షేమ శాఖ మం త్రి డీవీబీ స్వామి అన్నారు. అద్దంకిలో పలు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన మంత్రులు స్వామి, రవికుమార్లకు వేర్వేరుగా సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భం గా పనిభారం తగ్గించాలని, ఇంటింటి సర్వేలు లేకుండా చేయాలని సచివాలయ ఉద్యోగులు మంత్రి స్వామిని కోరగా స్పందించిన మంత్రి ఇంటింటి సర్వే సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. గతంలో ఒక పంచాయతీ కార్యదర్శి చేసే పనికి ప్రస్తుతం 8 మంది సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నందున పని విభజన చేసుకొని ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు.

రోడ్డు అంచులు లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం

మేదరమెట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొరిశపాడులో సిమెంట్ రోడ్డుకు అంచులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి రావినూతల వరకు రహదారులు భవనాల శాఖ అధ్వర్యంలో రోడ్డు నిర్మించారు. హైవే నుంచి కొరిశపాడు చెరువు వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. సిమెంట్ రోడ్డు నిర్మిణ సమయంలో రోడ్డు అంచులు సక్రమంగా నిర్మించలేదు. దీంతో సిమెంట్ రోడ్డుకు ఉత్తరం వైపున పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. కొత్త వ్యక్తులు ఎవరైనా ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేసేటప్పుడు అంచులు అర్థంకాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఒకసారి కట్టెల ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఇదే దారిలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు మండల కార్యాలయానికి, ప్రాథమిక ఆ రోగ్య కేంద్రానికి , పశువుల ఆస్పత్రికి వచ్చే ప్రజలు ఎదురు వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్నారు. కొరిశపాడు నుండి కుర్రావానిపాలెం మీదగా రావినూతల వెళ్లే వారు కూడా ఈ రోడ్డునే ప్రయాణిస్తుంటారు. రహదారులు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి సిమెంట్ రోడ్డుకు రెండు వైపులా గ్రావెల్‌తో అంచులను వేయాలని కొరిశపాడు గ్రామస్థులతో పాటు మండల ప్రజలు కోరుతున్నారు.



అంచులేని సిమెంట్ రోడ్డు

ఆక్వా సాగు చేసే ప్రతి రైతు లైసెన్స్ తీసుకోవాలి

చినగంజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఆక్వా సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని కారంచేడు మత్స్యశాఖభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర సోమవారం తెలిపారు. రాష్ప్రభుత్వం ఆక్వాసాగు, ఆక్వా బిజినెస్ ఆపరేషన్స్ చేపల, రొయ్యల చెరువులను క్రమబద్ధీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020ను తీసుకొని వచ్చిందన్నారు. ఈ యాక్ట్ కింద చెరువులను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇప్పటి వరకు లైసెన్స్ లేకపోవడం, లైసెన్స్ ఉండి రెన్యువల్ చేయలేకపోతే రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2020, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఆక్వా రైతులు లైసెన్స్ లేని వారు, రెన్యువల్ చేయని వారందరూ ఆయా గ్రామాల మత్స్య సహాయకులను సంప్రదించాలన్నారు. పెదగంజాం గ్రామమత్స్య సహాయకులు ఎస్‌కే.కాలేషా సెల్ నెంబరు.9494630542, మోటుపల్లి గ్రామానికి డి.రామారావు సెల్ నెంబరు.6281738228, చినగంజాం, కొత్తపాలెం గ్రామాలకు సీ.హెచ్.డార్విన్ సెల్ నెంబరు 9441996257, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం గ్రామాలకు పి.సుబ్రహ్మణ్యం సెల్ నెంబరు 9963228864లను సంప్రదించాలన్నారు.

మురుగునీరు ముందుకెళ్లేలా కాలువ తవ్వకం



మురుగునీరు బయటకు వెళ్లేలా కాలువ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బల్లికురవలో చిన్నపాటి వర్షం కురిసినా, వర్షపు నీరు పల్లంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోని పెద్దఎత్తున చేరుతోంది. కార్యాయాల ముందు ఉన్న మురుగు కాలు వలో మురుగు పేరుకపోయింది. దీంతో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో కార్యాలయాలలోకి నీరు వెళ్లింది. తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారిలు కార్యాలయం లోని నీరు బయటకు వచ్చేలా కాలువ తవ్వించారు. రోడ్డు అంచులోని చిరు దుకాణాల వారిని వెంటనే ఖాళీ చేయించి కాలువ పనులు చేయిస్తున్నారు. గతంలో ఉన్న కాలువను పైపులను తీయించి మురుగు నీరు వాగులోకి వెళ్లేలా పనులు చేయిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలువ పనులు చేయిస్తున్నామని అధికారులు తెలిపారు. రోడ్డు వెంబడి దుకాణాలు నిర్వహించుకొనేవారు కాలువలను పూడిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- పర్చూరు సెంటర్‌లో తక్కువ ధరకు ఉల్లిపాయల విక్రయం



ప్రజలకు ఉల్లిపాయలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. సోమవారం ఏఎంసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉల్లి రైతులకు సరైన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ఉల్లిపాయలను కేజీ రూ. 11 చొప్పున స్థానిక బొమ్మల సెంటర్‌లో ఏఎంసీ చైర్మన్ పంపిణీ చేశారు. ఉల్లిపాయలు తక్కువ ధరకు అమ్మకాలు చేయడంతో ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా.., ప్రభుత్వం ముందుండి వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. పొగాకు, కొబ్బరి, మామిడి పంటలకు గిట్టుబాటు లేకున్నా, వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి వారిని ఆదుకోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డెరెక్టర్ షేక్ షంషుద్దీన్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు డోలా కుటుంబం

అద్దంకి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు డోలా కుటుంబం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సభ్యులు తక్కువ మంది ఉన్నా అసెంబ్లీలో వైసీపీ సభ్యుల అరాచకాలను ఎదురొడ్డి నిలబడడంలో స్వామి ముందున్నారన్నారు. అదే కుటుంబానికి చెందిన ఆయన సోదరి పద్మావతి హెచ్‌ఎంగా పనిచేస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న డోలా సువర్ణ పద్మావతి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా 36 సంవత్సరాల పాటు స్కూల్ అసిస్టెంట్‌గా, ప్రధానోపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. మంత్రి స్వామి మాట్లాడుతూ తన సోదరి పద్మావతి క్రమశిక్షణ, నిజాయితీగా పనిచేయటం ద్వారా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు. మంత్రులు రవికుమార్, స్వాములు పద్మావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రకాశం డీఈవో కిరణ్‌కుమార్, చీరాల డిప్యూటి ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈవో కేవీ శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ, ఒంగోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, ప్రకాశం జిల్లా డీసీఈబీ కార్యదర్శి మ ర్రి శ్రీనివాసరావు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిలుకూరి గోపీ, వెంకటరావు, వేణుగోపాల్, కౌన్సిలర్ సుభాషిణి, లహరి తదితరులు పాల్గొన్నారు.



డోలా సువర్ణ పద్మావతిని సన్మానిస్తున్న మంత్రులు

రాహుల్‌గాంధీ పిలుపుమేరకు సంతకాల సేకరణ



సంతకాల సేకరిస్తున్న నేతలు

పర్చూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జరుగుతున్న ఓట్ల చోరీ జరుగుతోందని, కేంద్ర ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పర్చూరులో సంతకాల సేకరణ నిర్వహించారు.. ఈ సందర్భం గా నియోజకవర్గ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగొర్ల శివలక్ష్మీజ్యోతి ఆధ్వర్యంలో రోటరీ భవనంలో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మాట్లాడుతు రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- బాలాత్రిపురసుందరిగా అమ్మవారు దర్శనం
- అద్దంకిలో గుండ్లకమ్మ నుంచి జలాలు తెచ్చిన మహిళలు



కలశాలతో జలం తీసుకొస్తున్న మహిళలు

అద్దంకి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం, వేయిస్తంభాల గుడి, దత్తపాదుకా క్షేత్రం తదితర దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఉదయం గుండ్లకమ్మనది నుంచి 108 కలశాలతో మహిళలు జలం తీసుకొని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ పూటుకూరి రామకోటేశ్వరరావు, ఉమాఅన్నపూర్ణ దంపతులు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావు, గార్లపాటి శ్రీనివాసరావు, చిన్ని శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్ పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం నుంచి భక్తిశ్రద్ధలతో దసరా శరన్నవరాత్రి పూజమహోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు ప్రతి ఇంట్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించారు. మండలంలోని కొప్పెరపాడు బొడ్డురాయి కూడలిలో దుర్గాదేవి విగ్రహాన్ని భక్తులు సమష్టిగా పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

మార్టూరు : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి మండలంలోని అ మ్మవారి దేవాలయాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాలలో, వివిధ దేవాలయాల్లో అలంకరించారు. మార్టూరులో బొడ్డు రాయి కూడలి వద్ద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మ వారిని కన్యకాపరమేశ్వరి అవతారంలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీదుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని బాల త్రిపురసుందరి అవతారంలో అలంకరించారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో ప్రత్యేకంగా హైదరాబాదు నుంచి తీసుకొచ్చిన అమ్మవారి విగ్రహానికి మహాచండీ దేవి అవతారంలో అలంకరించారు. ద్రోణాదుల గ్రామంలో శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మ వారిని తొలి రోజు బాల త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్ల గ్రామంలో అమ్మ వారి దేవాలయంలో భక్తులకు బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు.

మేదరమెట్ల : దసర శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తొలిరోజున అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వర అ మ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. ఉదయం నుంచే అభిషేకాలు , ప్రత్యేక పూజలను ఆలయ పూజారి రాజశేఖరశర్మ నిర్వహించారు. మండలంలోని అన్ని దేవాలయాలల్లో అమ్మవారు ప్రత్యేక పూజలను అందుకున్నారు.. పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలోని పలు దేవాలయాలలో విజయదశమి పర్వదినం సందర్భంగా శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. మందిరంలోని బతుకమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామంలోని శ్రీలలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని లలితాదేవి అమ్మవారిని, భవానీపురంలోని కనకదుర్గా భవాని అమ్మవారి దేవస్థానం లోని కనకదుర్గాభవాని అమ్మ వారిని శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా, అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని పలు దేవాలయాలలోని అమ్మవార్లను పలు రకాల అలంకారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమైనాయి. బ్రహోత్సవాలు సందర్భం గా ఆలయంలోని శ్రీవారిని, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమారైలుగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రికి అంకురారోపణ పూజలు జరిపారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంగులూరు: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతి షిర్డీసాయి ఆలయంలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యపూజ, శ్రీదేవీ నవావర్ణపూజ, మండప ఆరాధన, కలశస్థాపన, రుద్రాభిషేకము, శ్రీచక్రార్చన, శాంతిహోమం కార్యక్రమాలు ఆలయ అర్చకస్వామి సర్వేపల్లి దివ్యరూపాచారి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. కొండమూరులో కొండమూరమ్మ అమ్మవారి ఆలయప్రాంగణంలో అర్చకస్వామి కొండకావూరి శివయ్యశర్మ శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రామకూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీబాలత్రిపురసుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వామి నూతలపాటి వెంకటేష్ నేతృత్వంలో పూజాకార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.






అద్దంకి, బల్లికురవ, చినగంజాం, ముప్పవరంలో బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు




మార్టూరులో మహచండీ అవతారంలో అమ్మవారు, కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత